సాక్షి నిజామాబాద్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



ధరణితో సమస్యలెన్నో.. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్ రైతుల పాలిట శాపంగా మారింది.

- 8లో ▸



పరీక్షలు పక్కాగా నిర్వహించాలి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 41.5 /26.5

వాతావరణం ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో హిమోఫీలియో వ్యాధి సేవలు ప్రారంభం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హిమోఫీలియో(రక్తం గడ్డ కట్టకపోవడం) వ్యాధి సేవలు ప్రారంభమయ్యాయి. ప్రపంచ హిమోఫీలియో డే సందర్భంగా మంగళవారం ఆస్పత్రి రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన వార్డును జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూ కిరణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఇప్పటివరకు హిమోఫీలియో సేవలు అందించేందుకు ప్రత్యేక వార్డు లేకపోవడంతో ఆ వ్యాధిగ్రస్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం హిమోఫీలియో సొసైటీ నిజామాబాద్ చాప్టర్ సహకారంతో జీజీహెచ్‌లో రోగులకు సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. మేయర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో వైద్యులు అందిస్తున్న సేవలు హైదరాబాద్ తరహాలో ఉన్నాయన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో హిమోఫీలియో వ్యాధిగ్రస్తులు 250 మంది ఉన్నారని వీరికి ఇక నుంచి జీజీహెచ్‌లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిమోఫీలియో సొసైటీ అధ్యక్షుడు దాసరి విజయ ఆనంద్‌రావు, ఏడీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నీటిలో చేప పిల్లలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరానికి సరఫరా అయ్యే తాగునీటిలో చేప పిల్లలు వస్తున్నాయి. మంగళవారం నగరంలోని కంఠేశ్వర్ హౌసింగ్‌బోర్డు కాలనీలో మున్సిపల్ కుళాయిల ద్వారా వచ్చే నీటిలో చేపపిల్లలు వచ్చాయి. అంతేకాకుండా నీరు రంగు మారడంతో పాటు అపరిశుభ్రంగా ఉండడంతో కాలనీవాసులు మండిపడుతున్నారు.

పర్యవేక్షణ లేకనే..!

మున్సిపల్ శాఖ నీటికోసం ప్రతి ఏడాది రూ. లక్షల బడ్జెట్ కేటాయిస్తుంది. నీటిని క్లోరినేషన్ చేయాల్సిన సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నీరు యథావిధిగా ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. ప్యూరీఫై చేయడం లేదు. ఫలితంగానే అపరిశుభ్రమైన నీరు, చేపలు కుళాయిల ద్వారా సరఫరా అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

ఇక పాల్వంచ మండలం


సాక్షి, కామారెడ్డి/మాచారెడ్డి: జిల్లాలో మరో మండలం ఏర్పాటయ్యింది. మాచారెడ్డి మండలంలోని పాల్వంచ కేంద్రంగా రెవెన్యూ మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. పాల్వంచను మండలంగా ఏర్పాటు చేయాలని తాను ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్‌కు విన్నవించగా పరిశీలించి మండలం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. త్వరలోనే మంత్రుల చేతుల మీదుగా మండలాన్ని ప్రారంభిస్తామన్నారు. తన వినతి మేరకు పాల్వంచ మండలాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 23 మండలాలు ఉండగా.. పాల్వంచతో కలిపి మండలాల సంఖ్య 24కు చేరింది.

జిల్లాలో రెండు కరోనా కేసులు నమోదు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో మంగళవారం రెండు కరోనా కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో ఎం.సుదర్శనం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్‌గా తేలింది. దీంతో గడిచిన రెండు రోజులలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మూడుకు చేరింది.

ఎజెండా తూచ్..?

గత ఈసీ సమావేశం అనంతరం ఏడాదిన్నర కాలంలో పాలకమండలిని బేఖాతరు చేస్తూ వీసీ అనేక అక్రమాలు, అవకతవకలకు పాల్పడినట్లు సభ్యులు గుర్రుగా ఉన్నారు. కొనుగోళ్ల నియంత్రణ కమిటీని లెక్క చేయకుండా రూ. 14 కోట్ల మేర దుబారా ఖర్చు చేశారని చెబుతున్నారు. నేడు నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన ఎజెండాను సైతం నామమాత్రంగా రూపొందించారని ఈసీ సభ్యులు పేర్కొన్నారు.



- గత సమావేశం తీర్మానాల అమలు ప్రస్తావనే లేదు..
- ఈసీ అనుమతి లేకుండా విచ్చలవిడిగా నియామకాలు, టెండర్లు నిర్వహించకుండా అనేక వ్యవహారాలు
- డెంటిస్ట్‌తో హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్న విచిత్ర పరిస్థితి
- నేడు హైదరాబాద్‌లో తెలంగాణ వర్సిటీ పాలకమండలి సమావేశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ వర్సిటీ పాలకమండలి సమావేశం 17 నెలల సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం చొరవతో బుధవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో ఈసీ అనుమతి లేకుండా చక్కబెట్టుకున్న వ్యవహారాలపై చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. గత ఏడాదిన్నరలో పాలకమండలిని బేఖాతరు చేస్తూ వీసీ అనేక అక్రమాలు, అవకతవకలకు పాల్పడినట్లు ఈసీ సభ్యులు గుర్రుగా ఉన్నారు. అయినప్పటికీ తాజా సమావేశానికి సంబంధించి రూపొందించిన ఎజెండా తూతూమంత్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరిసారిగా 2021 నవంబర్ 27న నిర్వహించిన ఈసీ సమావేశంలో చేసిన తీర్మానాలను ఏమేరకు అమలు చేశారనే విషయమై ఎజెండాలో పొందుపర్చలేదు. పాలకమండలి ఏర్పాటు చేసిన కొనుగోళ్ల నియంత్రణ కమిటీని బేఖాతరు చేస్తూ రూ.14 కోట్ల మేర కొనుగోళ్లతో భారీగా దుబారా చేశారు. ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లిన కనకయ్యపై పోలీసు కేసు పెట్టాలని ఈసీలో నిర్ణయించినప్పటికీ ఎజెండాలో దాని ఊసే లేదు.

- ■ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ని నిధులు వచ్చాయి.. ఎంత ఖర్చు చేశారనే వివరాలు ఎజెండాలో పెట్టలేదు. వీటికి ఈసీ అనుమతి తప్పనిసరి. అయినా ఏ ఒక్క అంశం సైతం ఎజెండాలో పెట్టకపోవడం గమనార్హం. ఆయా అంశాలు ఇలా ఉన్నాయి.
- ■ టెండర్లు లేకుండానే మార్కెట్ ధర కంటే ఎక్కువకు లక్షల సంఖ్యలో ఆన్సర్ బుక్‌లెట్స్ తెప్పించారు.
- ■ పీజీతో పాటు యూజీ విద్యార్థుల భవిష్యత్ ఆధారపడిన మూల్యాంకనం సైతం ఈసీ అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థకు అప్పగించారు.
- ■ టెండర్లు లేకుండానే నాన్‌టీచింగ్ అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల ఏజెన్సీలకు రెన్యువల్ ఇచ్చారు.
- ■ కంప్యూటర్, జిరాక్స్, ప్రింటర్స్ తదితరాలకు మాన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్‌ను టెండర్ లేకుండానే ఇచ్చారు.
- ■ టెండర్లు లేకుండానే ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు అధిక ధరలు చెల్లించి కమీషన్లు దండుకున్నారు.
- ■ డైలీ వేజ్ సిబ్బంది నియామకాలు ఎజెండాలో పెట్టలేదు.
- ■ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పదోన్నతులు ఉండవు. అయినప్పటికీ వీసీ ఈసీతో సంబంధం లేకుండా ఇచ్చేశారు.

■ పాలకమండలి ఆమోదం లేకుండా ఒక్క పైసా ఖర్చు చేసినా క్షమించేది లేదని, ఆ మొత్తం నిధులను అందుకు బాధ్యులైన వారి నుంచే వసూలు చేస్తామని ఉన్నత విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. అయినప్పటికీ వీసీ ఇందుకు విరుద్ధంగా చేశారు. ఈ నేపథ్యంలో రూ.కోట్లాది నిధులను ఏవిధంగా వసూలు చేస్తారనేది ఈసీ సమావేశంలో తేలాల్సి ఉంది. వీటన్నింటిపై చర్చించేందుకు పాలకమండలి సభ్యులు సిద్ధమయ్యారు.

- ■ తొమ్మిది మంది నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెన్యువల్ ఇచ్చారు.
- ■ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆరోగ్య కేంద్రం నిర్వహించాలని అనుకోగా, ఇందుకు విరుద్ధంగా ఇందులో దంత వైద్యుడిని మాత్రమే నియమించారు. సాధారణ వైద్యులు లేకపోవడం విచిత్రం.
- ■ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పదోన్నతులు ఈసీతో సంబంధం లేకుండానే ఇచ్చారు.
- ■ వీసీ హైదరాబాద్‌లో తన కోసం నలుగురు సహాయకులను నియమించుకున్నారు.
- ■ భిక్కనూరు క్యాంపస్‌లో అనుమతి లేకుండా కొత్త కోర్సులు ఏర్పాటు చేసి అందులో రిటైర్డ్ అయిన వారిని నియమించారు.
- ■ మ్యాథమెటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్)ను అప్లయిడ్ ఎకనామిక్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా మార్చి ఎరియర్స్ పేరుతో సదరు ఉద్యోగికి రూ.9 లక్షలు ఇచ్చినట్లు చూపి బొక్కేశారు.
- ■ ఇక ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ 170 మందిని అక్రమ మార్గంలో నియమించారు.
- ■ ప్రోగ్రామర్ల వేతనాలను పెంచుతూ గతంలో వీసీ తీసున్న నిర్ణయాన్ని పాలకమండలి రద్దు చేసింది. రద్దు నిర్ణయం అమలు చేయకపోగా ఏకంగా సదరు ప్రోగ్రామర్లకు పదోన్నతులు కల్పించారు.
- ■ తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగులను నియమించలేదని గత ఈసీ సమావేశంలో చెప్పిన వీసీ 170 మందికి గత 3 నెలలుగా వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిసింది.

రూ. 41 కోట్లు..

- జిల్లాలోని ఏడు మార్కెట్ కమిటీల్లో వసూలైన ఫీజు
- 2022–23లో మెరుగుపడ్డ ఆదాయం
- త్వరలో కొత్త లక్ష్యాలు ఖరారు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఫీజు వసూళ్లు లక్ష్యానికి అనుగుణంగా జరిగాయి. పంటలు బాగా పండడంతో మార్కెట్ యార్డుల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. తద్వారా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏఎంసీల ఆదాయం మెరుగుపడింది. జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్ కలిపి మొత్తం ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో నిజామాబాద్ ఏఎంసీ అతిపెద్దది. అయితే, 2022–23 ఆర్థిక సంవత్సరానికి అన్ని ఏఎంసీలు కలిపి రూ. 44.15కోట్లు ఫీజు వసూలు చేయాలని మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని విధించింది. మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియగా రూ. 41.03కోట్లు వసూలైంది. ఇంకా రూ. 3.12 కోట్లు వసూలు కాలేదు. పంట అమ్మిన రైతుల వద్ద, కొనుగోలు చేసిన వ్యాపారుల వద్ద కలిపి ఒక శాతం ఫీజును ఏఎంసీలు వసూలు చేశాయి. అలాగే చెక్ పోస్టులు, మడిగెలు, గోదాముల కిరాయిలు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా కూడా ఫీజులు వసూలవుతున్నాయి. అంతకు ముందు ఏడాదిలో కరోనా కారణంగా రూ. 30కోట్లు కూడా దాటని మార్కెట్ల ఆదాయం ఇప్పుడు గణనీయంగా పెరిగింది.

నిజామాబాద్ ఏఎంసీలో 99శాతం..

నిజామాబాద్ నగరంలోని మార్కెట్ యార్డు జిల్లాలోనే అతిపెద్దది. ఇక్కడకు జిల్లా నుంచే కాకుండా చుట్టు పక్కల ఉన్న నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, ఇతర జిల్లాల నుంచి రైతులు వచ్చి పంటలను విక్రయిస్తారు. ఇక్కడ ఎక్కువ మొత్తంలో ఫీజు వసూలవుతోంది. రూ. 23.95 కోట్ల లక్ష్యానికి గాను రూ. 23.11 కోట్లకు పైగా ఫీజు వసూలు కావడం విశేషం. మిగతా ఆరు మార్కెట్ కమిటీల్లో మాత్రం టార్గెట్‌లో 90 శాతానికి పైగా ఫీజు వసూలయ్యాయి.

కొత్త లక్ష్యాలపై అంచనాలు..

2023–24 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ కమిటీలకు నూతన లక్ష్యాలు ఇంకా ఖరారు కాలేదు. అయితే, నిజామాబాద్‌తో పాటు మిగతా ఏఎంసీలు అంచనా లక్ష్యాలను రూపొందించుకున్నాయి. ఇందుకు జిల్లా మార్కెటింగ్ శాఖ ద్వారా రాష్ట్రశాఖకు ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిని పరిశీలన చేసి తుది లక్ష్యాలను నిర్దేశించనున్నారు.

కమిటీల టార్గెట్, వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)

ఏఎంసీ	టార్గెట్	వసూలైంది
నిజామాబాద్	2395.00	2311.88
బోధన్	569.86	490.74
ఆర్మూర్	263.00	218.27
వర్ని	443.78	416.94
కమ్మర్‌పల్లి	391.84	314.68
కోటగిరి	228.86	238.61
వేల్పూర్	123.43	112.15
మొత్తం	4415.77	4103.27

అందరి కృషితోనే సాధ్యమైంది..



నిజామాబాద్ మార్కెట్ కమిటీకి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం అందరి కృషితోనే సాధ్యమైంది. ఫీజు వసూళ్లు, ఆదాయంపై ప్రత్యేక దృష్టిసారించి మొబైల్ టీంలను ఏర్పాటు చేశాం. వచ్చే కొత్త టార్గెట్‌ను కూడా ఇదే విధంగా ప్రణాళిక వేసుకుని చేరుకుంటాం.

– వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, ఏఎంసీ, నిజామాబాద్

త్వరలో కొత్త టార్గెట్‌లు

గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో ఫీజులు వసూలయ్యాయి. ఆదాయం కూడా మెరుగుపడింది. ఈ ఆర్థిక సంవత్సరానికి కొత్త లక్ష్యాలు త్వరలో ఖరారవుతాయి. ఇచ్చిన టార్గెట్‌ను చేరుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తాం.

– ఎస్.గంగు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్సే



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి బూర నర్సయ్యగౌడ్, పక్కన ఎంపీ అర్వింద్

- ఎమ్మెల్యేలు అవినీతి అనకొండలు
- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

సుభాష్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారని మాజీ ఎంపీ, బీజేపీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని బీజేపీ నాయకులు పార్టీని అగ్రభాగాన ఉంచేందుకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అదేసమయంలో రాష్ట్రంలో ఎవరికి అవకాశమివ్వాలో ఓటర్లు స్పష్టతతో ఉన్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోతారని ప్రజలు తెలుసన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో 66 మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉండేవని, కానీ ఇప్పుడు ఒకటే ఉందన్నారు. నీళ్లేమో ఎస్సారెస్పీవి అని, ప్రచారం కాళేశ్వరం ప్రాజెక్టుదని విమర్శించారు. రాష్ట్రంలో బడేమియా.. చోటామియాలే ఉన్నారని, బడేమియా ప్రగతిభవన్‌లో, చోటా మియాలు నియోజకవర్గాల్లో ఉన్నారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అవినీతి అనకొండలు ఉన్నాయని ఆరోపించారు. వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ కోసం బిడ్లు వేస్తామని ప్రకటించారని, దీంతో ప్రజలు నవ్వుకుంటున్నారని, పక్కనున్న నిజాంషుగర్స్‌కు దిక్కులేదని ఎద్దేవాచేశారు. అనంతరం బూత్‌స్థాయి కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. సమావేశంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మీసాల చంద్రయ్య, ధన్‌పాల్ సూర్యనారాయణ, మల్లికార్జున్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పట్టింపేది..!

- జెడ్పీ సమావేశాలకు తరచుగా ప్రజాప్రతినిధులు డుమ్మా
- ఇదే సాకుతో జిల్లా అధికారులు సైతం గైర్హాజరు
- కోరం లేక వాయిదాల పర్వం

నిజామాబాద్‌నాగారం: ప్రజాప్రతినిధులు.. జిల్లా అధికారులు.. జెడ్పీటీసీ, ఎంపీపీలు ఇలా ఎవరైనా సరే వారికి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అంటే ఎంతో గౌరవం ఉండేది.. సమయపాలన పాటించి మరీ ప్రజాసమస్యలపై చర్చించేవారు.. అత్యంత కీలకమైన పలు అంశాలపై తీర్మానాలు జరిగేవి.. కానీ గత నాలుగేళ్లుగా జెడ్పీ సర్వసభ్య సమావేశం అంటేనే పట్టింపు లేకుండాపోతోంది. కీలకమైన ప్రజాప్రతినిధులే తరచుగా డుమ్మా కొడుతున్నారు.. ఇదే సాకుతో జిల్లా అధికారులు సైతం గైర్హాజరవుతున్నారు. జెడ్పీ సమావేశం రెండు, మూడు సార్లు కోరం లేక వాయిదాలు పడ్డ విషయం తెలిసిందే. దీంతో ప్రజా సమస్యలు గాలికిపోతున్నాయి.



తరచుగా డుమ్మా..!

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహిస్తారు. గతంలో జెడ్పీ సమావేశం సుదీర్ఘంగా గంటల తరబడిగా పలు శాఖలపై చర్చించి ఇందుకు పరిష్కార మార్గాలు చూపించేవారు. జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన 13సార్లు జెడ్పీ సమావేశం జరగగా జిల్లా మంత్రి ఇప్పటి వరకు 8 సార్లు హాజరయ్యారు. ఇక ప్రధాన ప్రజాప్రతినిధుల్లో ఇద్దరు కేవలం 6 సార్లు హాజరు కాగా.. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ ప్రతి జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరవుతున్నారు. డీసీసీబీ, ఐడీసీఎంఎస్, నామినేట్ పోస్టుల్లో ఉన్న ఇతర ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం సర్వసాధారణమైంది. ప్రజాప్రతినిధులు రాకపోవడంతో జిల్లాస్థాయి అధికారులు డుమ్మా కొట్టడమే కాకుండా, ఇలా వచ్చి అలా వెళ్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీల పరిస్థితి అలాగే తయారైంది. పలుమార్లు కోరం లేక వాయిదాలు పడ్డ విషయం కూడా అందరికీ తెలిసిందే. జెడ్పీ అంటేనే డుమ్మా కొట్టొచ్చులే అన్న భావన వచ్చింది.

నేడయినా హాజరవుతారో లేదో..

జెడ్పీ సర్వ సభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు అధ్యక్షతన నేడు జరుగనుంది. దీంతో ఈ సారయినా జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు, చైర్మన్‌లు, నామినేట్ పోస్టుల్లో ఉన్న ప్రజాప్రతినిధులందరూ హాజరవుతారో లేదో చూడాలి. వీరు రాకుంటే అధికారులు సైతం డుమ్మా కొట్టే పరిస్థితి ఉందని చర్చించుకుంటున్నారు.

సమస్యలు గాలికి..

ప్రజా సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులే డుమ్మా కొడుతున్నారు. దీంతో ప్రజా సమస్యలు గాలికి వదిలేస్తున్నారు. పలు శాఖలకు సంబంధించి సంక్షేమ పథకాలు, రైతులకు సంబంధించి రబీ కొనుగోలు,ఖరీఫ్ సాగుకు సమయాత్తమయ్యే అవకాశాలు, డెయిరీ, వైద్యారోగ్యశాఖ, వేసవి కారణంగా నీటి ఎద్దడి, తదితర సమస్యలపై క్షుణ్ణంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. చాలా శాఖలపై ప్రజాప్రతినిధులకు అనుభవం లేకపోవడంతో అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులకు అన్ని శాఖలపై పట్టు ఉంటేనే సుదీర్ఘంగా చర్చలు జరుగుతాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి జెడ్పీ సర్వసభ్య సమావేశంలో లేకుండా పోయింది.

పుష్కరాలపై నిర్లక్ష్యమేల!

- 22 నుంచి మంజీర నది పుష్కరాలు ప్రారంభం
- మెదక్ జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పట్టించుకోని అధికారులు



గోలిలింగాల వద్ద మంజీర నది

సాక్షి, కామారెడ్డి : మంజీర నదిని గరుడ గంగ అని కూడా పిలుస్తారు. ఈ నది మహారాష్ట్రలో ఎత్తైన బాలాఘాట్ ప్రాంతంలో పుట్టి ఉస్మానాబాద్ జిల్లా మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా గుండా ప్రవహించి సంగారెడ్డి జిల్లా గోడ్‌గావ్ వద్ద తెలంగాణలోకి అడుగిడుతుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల మీదుగా పరుగులిడుతూ వచ్చి నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల వద్ద కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్, బాన్సువాడ, బీర్కూర్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి, బోధన్, రెంజల్ మండలాల మీదుగా ప్రవహించి, కందకుర్తి వద్ద గోదావరిలో ఐక్యమవుతుంది. మొత్తంగా నది ప్రయాణం 724 కిలోమీటర్లు. మంజీర నది 823 మీటర్ల ఎత్తున మొదలై కందకుర్తి వద్ద 323 మీటర్లకు దిగుతుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు వంద కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. నది పొడవునా అనేక గ్రామాలు, పట్టణాలున్నాయి. ఎన్నో ఆలయాలు వెలిశాయి. ఈ నదిపై సింగూరు, నిజాంసాగర్, ఘణపురం ఆనకట్టలు నిర్మించారు. మూడు ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందుతోంది. అలాగే మంజీర లక్షలాది మంది దాహార్తి తీరుస్తోంది.

నది పొడవునా...

మంజీర నది పొడవునా ఎన్నో ఆలయాలున్నాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల వద్ద మంజీర నది ఒడ్డునే శివాలయం ఉంది. ఇటీవల గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. ఇదే మండలంలో తాండూరు శివారులో మంజీర నదికి సమీపాన అతి పురాతన త్రిలింగేశ్వరాలయం ఉంది. పుష్కరాల కోసం ఆలయానికి సమీపంలోని మంజీరలో ఏర్పాట్లు చేస్తే ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుంది. నిజాంసాగర్ మండలంలో నాగమడుగు వద్ద ఏటా మాఘమ అమావాస్య రోజున చాలా మంది నదీ స్నానమాచరిస్తారు. ఇక్కడ పుష్కర స్నానాలకు ఏర్పాట్లు చేయడానికి అనుకూల పరిస్థితులున్నాయి. దిగువన పిట్లం, బిచ్కుంద, మద్నూర్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల పరిధిలో కూడా పలుచోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయవచ్చు. గోదావరిలో మంజీర కలిసిపోయే కందకుర్తికి చారిత్రక నేపథ్యం ఉంది. అక్కడా మంజీర పుష్కరాలకు కావలసిన ఏర్పాట్లు చేయొచ్చు. ఇప్పటికైనా రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, మంజీర పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేయాలి..



గంగానది పుష్కరాలు జరిగే సమయంలోనే ఈ మంజీర పుష్కరాలు నిర్వహిస్తారు. గతంలో నిజాం సంస్థానంలో మంజీర పుష్కరాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో 2011లో బాన్సువాడ సమీపంలోని బోలక్‌పల్లి బ్రిడ్జి వద్ద మంజీర పుష్కరాలు ఘనంగా నిర్వహించాం. మంజీర నది పరీవాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు వెలిశాయి. మంజీరకు దక్షిణ గంగా అని పేరుంది.

–గాజుల రాజులు, మంజీర పుష్కర కమిటీ అధ్యక్షులు బాన్సువాడ

మరో మూడు రోజుల్లో..

ఉత్తర భారతంలో విశాలంగా ప్రవహించే గంగానది పుష్కరాలతో పాటే మంజీర పుష్కరాలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 22న ప్రారంభమయ్యే పుష్కరాలు.. వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కాగా 2011లో మంజీర తీర ప్రాంత ప్రజలు పుష్కరాలు జరు పుకున్నారు. సమైక్య రాష్ట్రంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో అప్పట్లో సరైన ఏర్పాట్లు చేయలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడం స్థానికుల ను విస్మయానికి గురిచేస్తోంది.

ఈనెల 22 నుంచి పుష్కరాలు ప్రారంభం కానుండగా.. ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దాని గురించిన ప్రచారం కూడా చేపట్టలేదు. అధికారుల నిర్లక్ష్యంతో మంజీర నదికి పుష్కరాలు వచ్చాయన్న విషయం కూడా ఈ ప్రాంత ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్కడి అధికారులు పుష్కరాల కు ఏర్పాట్లు చేస్తున్నా.. మన జిల్లాలో మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

‘ధరణి’తో దారుణాలెన్నో..

- ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు
- డిజిటల్‌ సంతకాల కోసం రైతుల ఎదురుచూపులు
- కలెక్టర్‌ కార్యాలయంలోనే మూలుగుతున్న వేల దరఖాస్తులు



ఇందల్వాయి : భూ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ సర్కారు ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్‌ రైతుల పాలిటి శాపంగా మారింది. ధరణికి ముందు తహసీల్దార్‌ కార్యాలయంలోనే పరిష్కారం లభించే చిన్నచిన్న భూ సమస్యలు కూడా ఇప్పుడు ధరణి వెబ్‌సైట్‌ ద్వారా కలెక్టర్‌కి విన్నవించాల్సి రావడం, క్షేత్ర స్థాయిలో సర్వేయర్‌, ఆర్‌ఐలు సర్వే చేసి కలెక్టర్‌కి నివేదిక పంపడం వంటి కఠినతర నిబంధన కారణంగా రైతులు విసిగిపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే..

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ఉపయోగించిన ఎల్‌ఆర్‌యూపీ వెబ్‌సైట్‌ని రద్దు చేసి ధరణి వెబ్‌సైట్‌ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్‌ పుణ్యమా అని భూ వివరాలు సరిదిద్దే అవకాశం తహసీల్దార్‌ల చేతుల నుంచి పూర్తిగా కలెక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. రైతులు తమ భూ సమస్యలను ధరణి వెబ్‌సైట్‌ ద్వారా కలెక్టర్లకు విన్నవించేందుకు వెబ్‌సైట్‌లో జీఎల్‌ఎం, టీం–33 మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆప్షన్‌ల ద్వారా వేల మంది రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కి విన్నవిస్తున్నారు. దరఖాస్తులను తహసీల్దార్‌ కార్యాలయంలో పరిశీలించి సర్వే నంబరుపై మోకా పంచనామా నిర్వహించి తుది నివేదికను కలెక్టర్‌ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడకు చేరిన నివేదికలను వేగంగా పరిశీలించి డిజిటల్‌ సంతకాలు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల దరఖాస్తులు నెలల తరబడి కలెక్టర్‌ కార్యాలయంలోనే ములుగుతున్నాయి.

పరిష్కారాలు వందల్లోనే..

ధరణిలో నమోదు కాని ఖాతాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, అచ్చుతప్పులు, ఒకరి భూమి మరొకరి పేరుతో, పట్టా భూమి ప్రభుత్వ భూమిగా నమోదు, సాగుభూమి నాలాగా చూపడం వంటి సమస్యలపై కలెక్టర్‌ ఆఫీస్‌లో వేలల్లో దరఖాస్తులు వెళ్తే వందల్లో పరిష్కృతమవుతున్నాయి.

ఏడాదిన్నరగా తిరుగుతున్నా



నల్లవెల్లిలోని 352 సర్వే నంబరులో 1–16 గుంటల భూమి ఆన్‌లైన్లో మా పేరు మీద ఉంది కానీ అధికారులు చేసిన తప్పిదం కారణంగా నాలుగేళ్లుగా డిజిటల్‌ సంతకం పెండింగ్‌లోనే ఉంది. భూమి మాదని తెలిపే అన్ని పత్రాలతో ఏడాదిన్నరగా రెవెన్యూ ఆఫీస్‌ చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. – శ్యామాయిగారి రాజారెడ్డి, నల్లవెల్లి

వేగంగా పరిష్కరించాలి..



సిర్నాపల్లి గ్రామంలో సర్వే నం. 708,709లో ఉన్న సుమారు ఎకరం పట్టా భూమికి డిజిటల్‌ సంతకం కోసం నాలుగు నెలల క్రితం ధరణిలో మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. ఆర్‌ఐ, సర్వేయర్‌ మోకా పంచనామా చేసి నివేదికను కలెక్టర్‌ ఆఫీస్‌కు పంపించారు. ఇప్పటికి ఆన్‌లైన్లో డిజిటల్‌ సంతకం కానట్లుగానే ఉంది. ఇలా అయితే ఎలా..? –పనాస లక్ష్మి నారాయణ, రైతు సిర్నాపల్లి

రుణం పొందలేకపోతున్నాం



నల్లవెల్లి గ్రామంలో సర్వే నం.1652లో మాకున్న మూడెకరాల భూమికి డిజిటల్‌ సంతకం కోసం ఏడాది పాటు దరఖాస్తులు చేసుకుంటూ అధికారుల చుట్టూ తిరిగితే ఆన్‌లైన్‌లో డిజిటల్‌ సంతకం అయింది. కానీ ఇప్పటి వరకు పాస్‌బుక్‌ చేతికందలేదు. పాస్‌బుక్‌ కోసం మీ సేవలో రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి స్పందన లేదు. – లొక్కిడి సతీష్‌, నల్లవెల్లి

పెండింగ్‌లోనే దరఖాస్తు..



మానాన్న చనిపోయిన తర్వాత తన పేరుమీద నల్లవెల్లిలో 225 సర్వే నంబర్‌లో ఉన్న ఎకరంన్నర భూమి కోసం సక్సేషన్‌ దరఖాస్తు చేసుకున్నాం. ఆర్‌ఐ, సర్వేయర్లు రెండుమార్లు మోఖ పంచనామా, సాక్షుల వాంగ్మూలం తీసుకొని కలెక్టర్‌ వద్దకు పంపినా ఇంకా మా పేరు మీదకు భూమి రావడం లేదు. అధికారులను సంప్రదిస్తే ఫైల్‌ కలెక్టర్‌ వద్ద పెండింగ్‌లో ఉందని అంటున్నారు. – పాతకుంట రాములు, నల్లవెల్లి

‘ఓపెన్‌’ పరీక్షలను పక్కాగా జరగాలి

- అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌
- విద్యార్థుల కోసం 9849234696తో కంట్రోల్‌ రూం ఏర్పాటు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌ : ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్‌ ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మే 4 వరకు ఎస్సెస్సీ, ఇంటర్‌ ఓపెన్‌ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. మొత్తం 3,359 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరి కోసం నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ పట్టణాల్లో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బస్టాండ్లలో హెల్ప్‌ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్‌ రూమ్‌ నం. 9849234696లో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. విద్యుత్‌ సరఫరాకు ఇబ్బంది ఉండవద్దని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. మూడు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు నియమించాలని, ప్రతి కేంద్రంలో సిట్టింగ్‌ స్క్వాడ్లు ఉండాలన్నారు. చీఫ్‌ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు నియమించి పరీక్షల నిర్వహణ విధుల గురించి శిక్షణ ఇవ్వాలన్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్‌ సెంటర్లు మూసేయించాలని, 144 సెక్షన్‌ అమలు చేయాలన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలను కేంద్రాల్లో డ్యూటీలు వేయాలన్నారు. అదనపు పోలీస్‌ కమిషనర్‌ మధుసూదన్‌రావు, పరీక్షల కో ఆర్డినేటర్‌ తుల రవీందర్‌, అధికారులు పాల్గొన్నారు.

బడా రాంమందిర్‌ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న అధికారిణి సుప్రియ

నిజామాబాద్‌ సిటీ : నగరంలోని గాజుల్‌పేట్‌ బడా రాంమందిర్‌కు చెందిన సర్వేనం. 1757 భూములను దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్‌ ఎన్‌ సుప్రియ మంగళవారం పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి హైకోర్టులో కేసులు నడుస్తుండటంతో భూములను పరిశీలించినట్లు సహాయ కమిషనర్‌ తెలిపారు. అనంతరం రాంమందిరంలో ప్రత్యేక అర్చనలు చేసి ఉపాలయమైన కాలా హనుమాన్‌ దేవాలయం దర్శించుకున్నారు. ఈ ఆలయంలోని కోనేరు, గోశాలను సందర్శించారు. అనంతరం రాంమందిర్‌ మఠాధిపతి దినకర్‌ స్వామిని కలిసి శ్రీ రామచంద్ర మహరాజ్‌ ఉత్తరాధకారితో మఠం విషయాలను అడిగి తెలుసుకున్నారు. సహాయ కమిషనర్‌ వెంట ఈవో వేణు, జూనియర్‌ అసిస్టెంట్లు అంజనేయులు, ప్రశాంత్‌కుమార్‌ ఉన్నారు.

బీఈడీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలో ఈ నెల 20 నుంచి ప్రారంభం కావాల్సిన బీ ఈడీ మొదటి సెమిస్టర్‌ థియరీ పరీక్షలు వాయిదా వేసి, రీషెడ్యూల్‌ విడుదల చేసినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్‌ పండుగను పురస్కరించుకుని ముస్లిం విద్యార్థుల వినతి మేరకు ఈ పరీక్షలను ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ తెలిపారు. తెయూ పరిధిలోని అన్ని బీఈడీ కళాశాలల విద్యార్థులు ఈ విషయం గమనించాలని, www.telangana university. ac.in లో సంప్రదించాలన్నారు.

తెయూను సందర్శించిన మేయర్‌



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ హెల్త్‌ సెంటర్‌ను తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌తో కలిసి మేయర్‌ దండు నీతూకిరణ్‌ మంగళవారం సందర్శించారు. హెల్త్‌ సెంటర్‌లో వర్సిటీ విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్‌ అనూష మేయర్‌కు వివరించారు.

క్లుప్తంగా

తెయూ స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ ఇన్‌చార్జిగా బీఆర్‌ నేత



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ (కాంట్రాక్ట్‌)గా పనిచేస్తున్న ఫిజికల్‌ డైరెక్టర్‌ బీఆర్‌ నేత స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ ఇన్‌చార్జీగా నియమితులయ్యారు. తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ బి.విద్యావర్ధిని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన ఛాంబర్‌లో నేతకు వీసీ ఉత్తర్వులు అందజేశారు.

పుష్పాల రవీందర్‌కు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ తెలుగు విభాగంలో పరిశోధక విద్యార్థి పుష్పాల రవీందర్‌ పీహెచ్‌డీ డాక్టరేట్‌ సాధించారు. తెయూ ఆర్ట్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ కనకయ్య పర్యవేక్షణలో ‘తెలంగాణ కథా సాహిత్యంలో గల్ఫ్‌ వలసల చిత్రణ’ అనే అంశంపై పుష్పాల రవి పరిశోధన గ్రంథం సమర్పించారు. మంగళవారం తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల సెమినార్‌ హాల్‌ లో నిర్వహించిన వైవాకు తెలుగు వర్సిటీ ప్రొఫెసర్‌ వెంకన్న ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ బాలశ్రీనివాసమూర్తి, విభాగాధిపతి ప్రొఫెసర్‌ లావణ్య, ప్రొఫెసర్‌ త్రివేణి, లక్ష్మణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్‌ ఫెలోషిప్‌కు మురళీధర్‌ గౌడ్‌



కామారెడ్డి టౌన్‌ : కేంద్ర బొగ్గు గనుల శాఖ, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్‌ ఉప్పునూతల మురళీధర్‌ గౌడ్‌ సీనియర్‌ ఫెలోషిప్‌ను పొందారు. గతంలో ఆయన డాక్టరేట్‌ పట్టా పొందారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై పరిశోధన చేయగా డాక్టరేట్‌ సాధించారు. ఇప్పుడు రెండేళ్లపాటు ఫెలోషిప్‌కు సంబంధించిన ఉత్తర్వులు అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెర్కిట్‌(ఆర్మూర్‌) : ఆలూర్‌ మండలం మిర్దాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జే రవి, జీ మదు, లక్ష్మీ, శారద, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

గడికోట నిర్మాణాలపై విద్యార్థులకు అవగాహన



దోమకొండ : మండల కేంద్రంలోని గడికోటలో మంగళవారం ప్రపంచ వారసత్వ కట్టడాల సందర్భంగా గడికోట నిర్మాణాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గడికోట ప్రాముఖ్యత, విశిష్టతలపై వారికి ట్రస్ట్‌ సీనియర్‌ మేనేజర్‌ బాబ్జీ తెలియజేశారు. వారసత్వ కట్టడాలను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ ప్రతినిధులు గణేష్‌ యాదవ్‌, వినోద్‌, రాజశేఖర్‌, వెంకటలక్ష్మి, రామకృష్ణ, హరిష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

విష పురుగు కరిచి వివాహిత మృతి


సునీత(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్‌ గ్రామానికి చెందిన కొండిగారి సునీత(27) సోమవారం రాత్రి గుర్తుతెలియని విషపురుగు కరవడంతో మృతి చెందింది. సోమవారం రాత్రి సునీత ఇంటిముందు వాకిట్లో కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు తెలియని విషపురుగు కరిచింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను గోపాల్‌పేటలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మెదక్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు చేసినట్లు ఏఎస్‌ఐ లచ్చిరాం తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ..


సుంకరి విఠల్‌(ఫైల్‌)

మాక్లూర్‌ : మండలంలోని అమ్రాద్‌ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సుంకరి విఠల్‌ (46) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గైని దయసాగర్‌ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్‌ తదితర డిమాండ్లతో గతంలో చేపట్టిన 80 రోజుల సమ్మెలో సుంకరి విఠల్‌ చురుకుగా పాల్గొన్నారన్నారు. ఆయన ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారిలో ఎవరికైనా ఒకరికి వీఆర్‌ఏగా ఉద్యోగం కల్పించాలని డిమాండ్‌ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌) : బీర్కూర్‌ మండల కేంద్రంలో మంగళవారం మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామంలో ఏడాది కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉండేవాడని అతని పేరు కళ్ల సాయిలు(48) అని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఆహారం సరిగ్గా తీసుకోవడం లేదని, ఎండ తీవ్రతకు గురై చనిపోయి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

చెరువులో పడి వృద్ధురాలు..

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి పోషవ్వ (65) ప్రమాదవశాత్తు గ్రామ శివారులోని ఆకులకుంట చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై కే.గణేష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా పోషవ్వకు మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం ఉదయం బర్రెలు కాసే వారు చెరువు వద్దకు వెళ్లగా నీటిలో పోషవ్వ మృతదేహం తేలుతూ కన్పించింది. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోయారు. ఇద్దరు కూతుళ్లు ఉండగా వారికి పెళ్లిళ్లు అయి అత్తవారిళ్లలో ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న పోషవ్వ మతిస్థిమితం లేకపోవడంతో చెరువులో పడిన విషయం ఎవరికీ తెలియరాలేదు. మృతురాలి కూతురు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె..



ఎడపల్లి(బోధన్‌) : మండలంలోని మంగల్‌పాడ్‌, కుర్నాపల్లి గ్రామాల మధ్య పంట పొలాల్లో మంగళవారం విద్యుత్‌ షాక్‌తో గేదె మృతి చెందింది. మంగల్‌పాడ్‌ గ్రామానికి చెందిన సిరిగిరి పెద్ద మల్లయ్య అనే రైతు తన గేదెను మేతకు పంపగా పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. రైతు మల్లయ్య ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయగా వారు సబ్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని వారు కోరారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని అధికారులు ఎలాంటి హామీ ఇవ్వట్లేదని స్థానిక పాడి రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

దోమకొండ : మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ నిర్వహించగా, దోమకొండకు చెందిన ఎస్‌కే సమీర్‌ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా, కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ 2 రోజుల జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

సొమ్ముల కోసం మహిళ దారుణ హత్య

- ఘాతుకానికి పాల్పడిన ఇద్దరు మేస్త్రీలు
- మృతురాలు అన్నారం వాసి


బెరికి నర్సవ్వ(ఫైల్‌)


లింగన్నపేటలో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : తమతో కలిసి పనిచేసే మహిళ సొమ్ములపైనే కన్నేసిన మేస్త్రీలు ఆమెను హతమార్చి సొమ్ములను కాజేసి రాజన్న సిరిసిల్లా జిల్లా కొత్తపల్లి గ్రామం అత్తపల్లి చెరువు వద్ద పడేసిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. అన్నారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన బెరికి నర్సవ్వ (38) కామారెడ్డికి ప్రతిరోజు అడ్డమీదికి కూలి పనికి వస్తుంది. శనివారం కామారెడ్డికి వెళ్లిన బెరిగి నర్సవ్వ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై కామారెడ్డి పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్‌ కేసు నమోదు చేయించారు. కూలి పనికి ఎక్కడికి వెళ్తుందో తెలుసుకున్న పోలీసులు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరపేట మండలం రాజుపేట గ్రామనకి చెందిన ప్రకాష్‌, ఎల్లయ్యను, సుకన్య అనే మహిళను అదుపులోకి తీసుకోవడంతో హత్య ఘటన వెలుగు చూసిందని కామారెడ్డి సీఐ నరేశ్‌ తెలిపారు. బెరిగి నర్సవ్వ మీదున్న 4 తులాల బంగారం కోసమే హత్య జరిగినట్లుగా తెలుస్తుందన్నారు. నర్సవ్వను రామారెడ్డిలో మద్యం తాగించి, అనంతరం గొంతునులిమి హత్య చేసి, మృతదేహాన్ని డ్రమ్ములో పెట్టి రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామంలోని అత్తపల్లి చెరువులో పడేసినట్టుగా సమాచారం. మృతురాలి భర్త సౌదిలో ఉండగా, కుమార్తె, కొడుకు ఉన్నారు. నిందితులు కామారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

లింగన్నపేటలో బంధువుల ఆందోళన

పోలీసులు తమకు న్యాయం చేయడం లేదని, కుటుంబ సభ్యులు బంధువులు, అన్నారం గ్రామస్తులు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రధాన చౌరస్తాపై ధర్నాకు దిగారు. నిందితులను గుర్తించి చెప్పినప్పటికీ పట్టుకోవడం లేదని, కుటుంబ సభ్యులు తెలిపారు. అమాయకురాలైన నర్సవ్వను పనికి తీసుకెళ్లి బంగారం దోచుకోవడంతో పాటు దారుణంగా హత్య చేసి చెరువులో పాడేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మున్సిపల్‌ ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

బోధన్‌టౌన్‌(బోధన్‌) : బోధన్‌ మున్సిపాలిటీలో చెత్త సేకరించే 5 ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. పట్టణంలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు చెత్త సేకరించిన అనంతరం బల్దియా కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్లను పార్కింగ్‌ చేశారు. అర్ధరాత్రి సమయంలో కార్యాలయంలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ ఆవరణలో పార్కింగ్‌ చేసిన 5 ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలతో పాటు ట్రాక్టర్‌ ఇంజిన్‌కు ట్రాలీని జత చేసేందుకు వినియోగించే పిన్‌ రాడ్‌లను కూడా చోరీ చేశారు. తెల్లవారుజామున కార్యాలయానికి వచ్చిన డ్రైవర్లు బ్యాటరీలు చోరీ జరిగిన విషయాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌కు సమాచారమిచ్చారు. ఆయన కమిషనర్‌ ఖమర్‌ అహ్మద్‌కు సమాచారం ఇవ్వగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 5 బ్యాటరీల విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని కమిషనర్‌ పేర్కొన్నారు. ఎస్సై నవీన్‌ మాట్లాడుతూ కమిషనర్‌ నుంచి ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాయి ఆలయంలో..


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న శ్రీ షిర్డి సాయి ఆలయంలో సోమవారం రాత్రి.10.15ని గంటలకు చోరీ జరిగినట్లు బాన్సువాడ రూరల్‌ సీఐ మురళి తెలిపారు. మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్‌ సేకరించామన్నారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా చోరీ చేసేందుకు ఒక్కరే వచ్చారని, చావిడిలో ఉన్న హుండీ నుంచి డబ్బులు తీసుకెళ్లాడని, అంతే కాకుండా ఆలయ గర్భగుడిలో ఉన్న బీరువాలో అభివృద్ధి పనుల కోసం ఉంచిన డబ్బులను కూడా ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆలయంలోని సుమారు రూ. 90 వేలు వరకు నగదు పోయినట్లు ఆలయ మేనేజ్‌మెంట్‌ సభ్యుడు పోతారెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై రంజిత్‌ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు హన్మాండ్లు, భూమేష్‌, వీరారెడ్డి, రాజేశ్వర్‌ రెడ్డి, సంజీవ్‌ ఉన్నారు.

సిరికొండలో బైక్‌..

సిరికొండ : మండల కేంద్రంలో గంధం మహేశ్‌ అనే యువకుడికి చెందిన బజాజ్‌ ప్లాటినా బైక్‌ (ఏపీ01ఎల్‌0702) మంగళవారం చోరీ అయినట్లు స్థానికులు తెలిపారు. బైక్‌ రిపేర్‌ చేసే మహేశ్‌ తన బైక్‌పై సామగ్రి కోసం స్పేర్‌ పార్ట్స్‌ దుకాణం వద్దకు వెళ్లాడు. బైక్‌ను రోడ్డుపై నిలిపి దుకాణంలోకి వెళ్లి వచ్చే సరికి అక్కడ బైక్‌ కనిపించలేదు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను తీసుకొని వెళ్తున్నట్లు కనిపించింది. బైక్‌ చోరీ ఘటనపై ఎస్సై నర్సింలును సంప్రదించగా సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


శంకర్‌ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌ : ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ శివారులో మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో శంకర్‌(65) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన శంకర్‌ వ్యక్తిగత పనిమీద గోవింద్‌పేట్‌కు వెళ్లి వస్తుండగా బైక్‌ అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా..

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌) : బీర్కూర్‌లోని స్థానిక పోలీసు స్టేషన్‌ వద్ద మంగళవారం బిచ్కుంద నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న కారు బోల్తా పడ్డ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం శ్రీనివాస్‌ అనే వ్యక్తి బిచ్కుంద నుంచి నిజామాబాద్‌ తిరుగు ప్రయాణంలో మూలమలుపు వద్ద వడ్ల కుప్పలు ఉండటంతో అదుపు తప్పడంతో కారు బోల్తా కొట్టిందన్నారు. కారులో ఉన్న వ్యక్తి సీటు బెల్టు పెట్టుకోవడంతో ఎటువంటి గాయాలు కాలేదన్నారు. ఆయన పుస్తకాల వ్యాపారం చేస్తుంటాడన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలు పెంచాలి

నిజామాబాద్‌ నాగారం : జిల్లాలో క్రీడా శిక్షణ శిబిరాల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా పేటా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్రీడల అధికారి ముత్తెన్నకు విన్నవించారు. మే 1వ నుంచి మే 30 తేదీ వరకు నిర్వహించబోయే వేసవి క్రీడ శిక్షణ శిబిరాల సంఖ్యను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభం అవుతుందన్నారు. ప్రస్తుతం 10 శిక్షణా శిబిరాలున్నాయని, మరింత సంఖ్య పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పేటా సంఘం అధ్యక్షులు గోపి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్‌, ఉపాధ్యక్షులు బట్టు రాజరాజేశ్వర్‌, కోశాధికారి శ్రీనివాస్‌ తదితరులున్నారు.

